# సూపర్ పవర్‌గా... రష్యా

**రష్యా.. 1990ల వరకు 'సోవియట్ రష్యా'గా బహుళ ధ్రువ ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అమెరికాకు దీటుగా సత్తా చాటిన దేశం. కానీ 1991లో సోవియట్ యూనియన్ పదిహేను దేశాలుగా విడిపోవడంతో రష్యా క్రమంగా ప్రాభవాన్ని కోల్పోయింది. అపార ఇంధన, ఖనిజ, మానవ వనరులు, దార్శనికత కలిగిన రాజకీయ నాయకత్వం ఉండటంతో త్వరితగతిన పుంజుకుంది. ఇంటా బయటా సమస్యలను పరిష్కరించుకుంటూ.. ప్రపంచ ఆర్థిక, రాజకీయ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉనికిని సుస్థిరం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. తద్వారా మళ్లీ సూపర్ పవర్ హోదా పొందేందుకు బహుముఖ వ్యూహాన్ని అనుసరిస్తున్న రష్యా ప్రస్తుత పరిస్థితిపై విశ్లేషణ..**

యూనియన్ ఆఫ్ సోషలిస్ట్ సోవియట్ రిపబ్లిక్స్(యూఎస్ఎస్ఆర్) అనేక రాజ్యాల ఉమ్మడి సమాఖ్యగా దీర్ఘకాలం అమెరికాతో దీటుగా నిలిచింది. భద్రతావసరాల దృష్ట్యా సైనిక పటిష్టతకు మొదటి ప్రాధాన్యమిస్తూ.. దేశాభివృద్ధికి కీలకమైన ఆర్థిక రంగాన్ని నిర్లక్ష్యం చేయడమే సోవియట్ యూనియన్‌కు శాపంగా మారింది. దాంతో 1985 నుంచి పరిస్థితులు దిగజారుతూ చివరకు 1991లో సోవియట్ యూనియన్ 15 స్వతంత్ర దేశాలుగా విడిపోయింది. అప్పటి నుంచి రష్యా తన ఆర్థిక, రాజకీయ వ్యూహాలను మార్చుకుంటూ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోంది.

## రాజకీయ సంస్కరణలు:

పెరుగుతున్న ఇస్లామిక్ మతవాదాన్ని అదుపు చేసి రాష్ట్రాల ఐక్యతను కాపాడటానికి రాజకీయ సంస్కరణలు తప్పనిసరని అప్పటి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భావించారు. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల ద్వారా ప్రాంతీయ గవర్నర్లను ఎన్నుకునే విధానాన్ని రద్దుచేసే బిల్లును 2004 సెప్టెంబర్ 28న పుతిన్ పార్లమెంటుకు పంపారు. దీంతో ప్రాంతీయ లెజిస్లేటర్ల అనుమతితో గవర్నర్లను నియమించే అధికారం ఆయనకు లభించింది. రష్యా ఐక్యతను దెబ్బతీసే లక్ష్యంతో.. టెర్రరిజాన్ని ప్రేరేపించే శక్తుల ఆటకట్టించడానికే ఈ చర్యలని విశ్లేషకుల అభిప్రాయం. ఈ చర్య పార్లమెంటు అధికారాలను తగ్గించి అధ్యక్షుడి చేతిలో అధికారాలను కేంద్రీకృతం చేస్తోందని పశ్చిమ దేశాలు విమర్శించగా.. రాజకీయ సంస్కరణలు ప్రజాస్వామ్య వాతావరణాన్ని హరిస్తున్నాయని దేశంలోని ఉదారవాదులు ఆక్షేపించారు. దేశంలో కీలకమైన ఇంధన వనరుల వెలికితీత, విక్రయ విధానాలను ప్రభుత్వమే రూపొందించి.. ప్రైవేట్ రంగ జోక్యాన్ని నిలువరించడమే సంస్కరణలు ఉద్దేశమని పరిశీలకుల భావన. దేశ అంతర్గత ఐక్యతకు చర్యలు తీసుకుంటూనే ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచేందుకు వీలుగా అంతర్జాతీయ విధానాన్ని మలచడానికి పుతిన్ ప్రయత్నించారు. భౌగోళికంగా, సైనికపరంగా, రాజకీయంగా రష్యా స్థానాన్ని దృష్టిలో పెట్టుకుని.. యూరప్, ఆసియా, ఆఫ్రికా, అమెరికాల్లో తమకు అనుకూల దేశాలతో సహకారం కొనసాగించడానికి రష్యా కట్టుబడి ఉందని పుతిన్ ప్రకటించారు. ప్రపంచ

దేశాల్లో తన ప్రభావానికి పునరుజ్జీవం ఇవ్వాలంటే పాత భావజాలాన్ని వదులుకోవాలని రష్యా నిర్ణయించింది. దీంతో దేశప్రయోజనాలే ప్రాతిపదికగా ఇతర దేశాలతో సంబంధాలు కొనసాగిస్తోంది. ఓ వైపు భారత్, చైనాలతో బంధాన్ని కొనసాగిస్తూనే మరోవైపు అమెరికా, నాటోలతో కూడా సంబంధాలను పటిష్టం చేసుకోవాలన్నదే పుతిన్ విధానమని రష్యా భద్రతా నిపుణుల వ్యాఖ్య.

## పార్లమెంటరీ ఎన్నికలు:

రష్యాలో డిసెంబర్ 2007లో పార్లమెంటరీ ఎన్నికలు జరిగాయి. పుతిన్ నేతృత్వంలోని యునైటెడ్ రష్యా పార్టీ 61.4 శాతం ఓట్లతో డ్యూమా (పార్లమెంటు దిగువ సభ)లోని 450 సీట్లలో 315 సీట్లను కైవసం చేసుకుంది. కమ్యూనిస్టులు 11.6 శాతం ఓట్లతో రెండో స్థానానికి పరిమితమయ్యారు. రష్యా ఫెడరేషన్ ఐక్యతకు, ఆర్థికవృద్ధికి గత ఎనిమిదేళ్లుగా పుతిన్ అనుసరిస్తున్న విధానాలకు ఈ ఎన్నికల ద్వారా ప్రజలు మద్దతు పలికారు. అంతేకాక.. పశ్చిమ దేశాల మద్దతుతో జార్జియా, ఉక్రెయిన్, కిర్గిజిస్థాన్‌లలో కొనసాగుతున్న వర్ణ ఉద్యమాలకు ఈ ఫలితాలు ఒక చెంపపెట్టుగా భావించవచ్చు.

## అధ్యక్ష ఎన్నికలు:

రష్యా రాజ్యాంగం ప్రకారం వరుసగా రెండుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి మూడోసారి ఆ పదవిని చేపట్టే అవకాశం లేదు. దీంతో 2008 మార్చిలో అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ పోటీ చేయలేదు. ఉప ప్రధానిగా ఉన్న దిమిత్రి మెద్వదేవ్‌ను అధ్యక్ష పదవికి అభ్యర్థిగా పుతిన్ ప్రతిపాదించారు. న్యాయనిపుణుడైన 42 ఏళ్ల మెద్వదేవ్ వాణిజ్య వర్గాలకు అనుకూలుడిగా పేరుంది. ఎన్నికల్లో మెద్వదేవ్ 70 శాతం పైగా ఓట్లతో ఎన్నికై, 2008, మే 7న రష్యా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేశారు. పుతిన్ విధానాలను తు.చ.తప్పక కొనసాగిస్తానని అప్పుడే మెద్వదేవ్ ప్రకటించారు. ఆ మరుసటి రోజే (2008, మే 8న) పుతిన్‌ను దేశ ప్రధాన మంత్రిగా రష్యా పార్లమెంటు ఆమోదించింది. 2008 నవంబర్ 14న అధ్యక్ష పదవీ కాలాన్ని, పార్లమెంటు కాలాన్ని 4 నుంచి 6 ఏళ్లకు పొడిగిస్తూ చేసిన రాజ్యాంగ సవరణను పార్లమెంటు ఆమోదించింది. సంస్కరణల సమర్థ అమలుకు, దేశ సుస్థిరతకు ఈ సవరణ తోడ్పడుతుందని మెద్వదేవ్ సమర్థించుకున్నారు.

## కొత్త విదేశాంగ విధానం:

సంస్కరణల్లో భాగంగా.. రష్యా విదేశాంగ విధానాన్ని రూపొందించింది. ఈ విధానంలో భారత్‌తో సంబంధాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. భారత్‌తో మునుపటికంటే ఎక్కువగా ఆర్థిక, రాజకీయ సహకారాన్ని కోరుతున్నట్లు ప్రకటించింది. తాజా అంతర్జాతీయ సమస్యలు, అన్ని రంగాల్లో పరస్పర ప్రయోజనం చేకూర్చే అంశాలపై ఇరు దేశాలు నిరంతరం చర్చించుకుంటూ.. ప్రధానంగా వాణిజ్య, ఆర్థిక సంబంధాల మెరుగు దిశగా కృషిచేయాలన్నది తమ అభిమతంగా రష్యా పేర్కొంది. ఆసియాలో చైనా,

భారత్‌లతో సంబంధాలు ఎంతో ముఖ్యమైనవే కాక ఎంతో వ్యూహాత్మకమైనవని రష్యా తొలిసారిగా వెల్లడించింది. ఇప్పటివరకూ అణ్వస్త్ర నిషేధ ఒప్పందంపై భారత్, పాకిస్థాన్‌లు సంతకం చేయాలని వాదించిన రష్యా.. కొత్త విదేశాంగ విధాన పత్రంలో పూర్తిగా ఈ అంశాన్ని పక్కనపెట్టింది. అలాగే 'రష్యా, చైనా, భారత్– త్రైపాక్షిక సహకారం అనే అంశాన్ని కొత్తగా చేర్చింది. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ)ను మరింత పటిష్టం చేయడానికి నూతన విధానం ప్రాధాన్యం ఇచ్చింది. నాటో విస్తరణ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించింది. ముఖ్యంగా ఉక్రెయిన్, జార్జియాలకు నాటో సభ్యత్వం అందించాలన్న ప్రణాళికను ఆక్షేపించింది. నాటో మిలటరీ నిర్మాణాలను రష్యా సరిహద్దుల సమీపంలోకి తీసుకు రావడాన్ని కూడా వ్యతిరేకించింది. చెక్ రిపబ్లిక్, పోలెండ్ దేశాల్లో క్షిపణి రక్షక కవచాన్ని ఏర్పాటు చేయాలన్న అమెరికా ఆలోచన యూరప్ భద్రతకు ముప్పు తెస్తుందని మెద్వదేవ్ హెచ్చరించారు. ఒక దేశం లేదా దేశాల గ్రూపు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లఘించి ఇతర దేశాల ప్రయోజనాలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకూడదన్నారు.

## రక్షణ విధానం:

సంస్కరణల పర్వంలో సైనిక దళాలను పెద్దఎత్తున పటిష్టపరచేందుకు రష్యా సిద్ధమైంది. సాంకేతిక రంగంలోని అభివృద్ధికనుగుణంగా సైనిక దళాలను ఆధునికీకరించి శక్తిమంతంగా తయారు చేయడానికి మెద్వదేవ్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఆదేశాలు జారీచేశారు. ఇటీవల జరిగిన జార్జియా యుద్ధాన్ని దృష్టిలో పెట్టుకుని దేశ అణ్వస్త్ర, సంప్రదాయిక ఆయుధాలను 2020లోగా పూర్తిగా నవీకరించేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని మిలటరీ కమాండర్లను కోరారు. ప్రపంచంలోని సైనిక, రాజకీయ పరిస్థితులను అంచనావేసి.. ఎదురవనున్న సవాళ్లను దీటుగా సమాధానమిచ్చేలా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సోవియట్ యూనియన్ విడిపోయిన తర్వాత మొదటిసారి రష్యా 2008 సెప్టెంబర్‌లో 'ది స్టెబిలిటీ–2008' పేరుతో అతి పెద్ద 'యుద్ధ క్రీడల'ను నిర్వహించింది. వీటిలో 50 వేల సైనిక దళాలు, యుద్ధ విమానాలు, నౌకలు, అణు క్షిపణులతోపాటు ఏడు వేల రకాల యుద్ధ పరికరాలను ప్రదర్శించింది. అంతేకాక నాలుగు దూరశ్రేణి అణ్వస్త్ర క్షిపణులను విజయవంతంగా ప్రయోగించింది. ప్రచ్ఛన్న యుద్ధానంతరం రష్యా ఇటువంటి ప్రయోగం చేయడం ఇదే మొదటిసారి. అలాగే ఇటీవల మొబైల్ లాంఛర్ ద్వారా టోపోల్ క్షిపణిని, సముద్రంలో న్యూక్లియర్ సబ్‌మెరైన్‌ను విజయవంతంగా ప్రయోగించింది. ఈ ఏడాది రష్యా రక్షణ వ్యయం 27 శాతం పెరిగి 53 మిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ప్రధాని పుతిన్ ప్రకటించారు.

## ఆర్థిక రంగం:

రష్యా తన ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు పలు చర్యలు తీసుకొంటోంది. విదేశీ వాణిజ్యం విషయంలో తన ప్రాధాన్యతను యూరప్ నుంచి ఆసియాకు మార్చుకుంది. ఆసియాలో భారత్, చైనాలతో వాణిజ్యానికి

అధిక ప్రాధాన్యత ఇస్తోంది. 2008 అక్టోబర్‌లో రష్యా మంత్రివర్గం ప్రకటించిన 'ఫారిన్‌ట్రేడ్ స్ట్రాటజీ త్రూ 2020'లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. వాణిజ్య విధానాన్ని ఆసియా మార్కెట్లకు అనుగుణంగా మార్చుకోవాలని.. భారత్, చైనా, ఇరాన్, అఫ్గానిస్థాన్, మంగోలియాలతో ఆర్థిక సంబంధాలను మెరుగుపరుచుకోవాలని ఆశిస్తోంది. తన నేతృత్వంలోని యురేషియా ఎకనమిక్ యూనియన్ సభ్య దేశాలతో (బెలారస్, కజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజకిస్థాన్) ఆర్థిక సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు రష్యా ప్రయత్నిస్తోంది. చమురు, సహజవాయువు రష్యా ప్రధాన ఎగుమతులు. 2020 కల్లా ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు రెట్టింపవుతాయని అంచనా. సైబీరియా నుంచి చైనా సరిహద్దుల వరకు ఆయిల్ పైప్‌లైన్ నిర్మాణానికి రష్యా, చైనా మధ్య 2008 అక్టోబర్‌లో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఏడాదికి 15 మిలియన్ టన్నులు చమురును పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తారు. తాజా విధానాలతో రష్యా, చైనాల మధ్య వాణిజ్యం 2008లో 50 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది 2010 కల్లా 60 నుంచి 80 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. వాణిజ్య మార్పిడిని డాలర్లలో కాక రూబుల్స్, యుయాన్‌లలోకి తీసుకురావాలని పుతిన్ కోరుతున్నారు. మరోవైపు ఇటీవలి ఆర్థిక సంక్షోభం, అధిక చమురు ధరలు రష్యా ఆర్థికవృద్ధికి అడ్డుకట్ట వేశాయి. అయినప్పటికీ దేశ స్థూల జాతీయోత్పత్తి రేటు వచ్చే ఏడాది 2 నుంచి 3 శాతం పెరుగుతుందని రష్యా ప్రభుత్వం ప్రకటించింది. రష్యా నెమ్మదిగా మార్కెట్ ఎకానమీ(స్వేచ్ఛా వాణిజ్యం)వైపు కదులుతోంది. విదేశీ పెట్టుబడిదారులకు ఆహ్వానం పలుకుతూ అంతర్జాతీయ వాణిజ్యంలో భాగస్వామ్యానికి ఆసక్తి చూపుతోంది. అత్యధిక చమురు ఉత్పత్తి దేశంగా రష్యా ఇంధన భద్రతకు అనుకూలమైన పాత్ర పోషిస్తోంది. మధ్య ఆసియా ఇంధన వనరులపై తన ప్రభావాన్ని సుస్థిరం చేసుకున్న రష్యా.. యూరప్ ఇంధన మార్కెట్‌పై ఆధిక్యాన్ని పెంచుకోవడానికి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.

## రష్యా-అమెరికా సంబంధాలు:

తాజా పరిస్థితుల నేపథ్యంలో.. రష్యా, అమెరికా సంబంధాలు మెరుగుపడే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సంబంధాల పునరుద్ధరణ కోసం ఇటీవల అమెరికా ఇచ్చిన పిలుపును రష్యా ఆహ్వానించింది. ప్రచ్ఛన్న యుద్ధసమయంలో పూర్తిగా క్షీణించిన సంబంధాలని పునర్నిర్మించుకోవడానికి ఒబామా నేతృత్వంలో అమెరికాకు అవకాశం ఏర్పడింది. ఇరు దేశాలు స్నేహహస్తాన్ని చాచడానికి ఇది సదవకాశమని అమెరికా ఉపాధ్యక్షుడు జోబిడెన్ వ్యాఖ్యానించారు. రష్యాతో అన్ని విషయాల్లో ఏకీభవించకపోయినా.. ఇద్దరికీ ప్రయోజనకర అంశాల్లో కలిసి నడవచ్చని జోబిడెన్ అభిప్రాయపడ్డారు. అఫ్ఘాన్‌కు అమెరికా సరఫరాలను పాక్ మీదుగాకాక తమ దేశం మీదుగా తీసుకువెళ్లడానికి రష్యా అనుమతించడం తాజా పరిణామాల్లో గుర్తించదగిన అంశం. ఈ సరఫరాలు ఆయుధాలు కాకూడదని షరతును విధించింది. ఇలా ఇరు దేశాలు తమ మధ్య ఉన్న అనేక సమస్యలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాలను కనుగొనాలనే దృక్పథాన్ని వ్యక్తపరచడం శుభసూచకం.